ఆంధ్రజ్యోతి

పల్నాడు జిల్లా వార్తలు

5

శుక్రవారం 15 నవంబరు 2024



మాచర్ల పట్టణ శివారులో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి

సమస్యలతో సహవాసం

రోడ్లపై మురుగు, పేరుకుపోయిన చెత్తచెదారాలు, దుర్వాసన, అపరిశుభ్రత, వర్షం వస్తే ముంపు, పొంగి ప్రవహించే డ్రెయిన్లు, పగలు రాత్రి అన్న తేడా లేకుండా దోమల దాడి, గుంతల రోడ్లు, ట్రాఫిక్ ఇక్కట్లు, అరకొర తాగునీటి సరఫరా, కుక్కల స్వైర విహారం, వెలగని వీధి దీపాలతో అంధకారం.. తదితర సమస్యలతో పుర ప్రజలు సహజీవనం చేస్తున్నారు. అభివృద్ధికి మారుపేరుగా నిలవాల్సిన మున్సిపల్ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. పట్టణాలను విస్తరిస్తూ పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపుతున్న పాలకులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపైన, మౌలిక వసతుల కల్పనపైనా కనీసం కూడా దృష్టి సారించడంలేదు. ఎన్నికలు జరుగుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ ప్రజల సమస్యలు మాత్రం తీరడంలేదు. అధ్వాన పారిశుధ్యం, అపరిశుభ్రమైన తాగునీటి సరఫరా, దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా పాలకులకు పట్టడంలేదు. సమస్యలపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా అధికారులు వాటిని తీర్చడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. మున్సిపాలిటీల్లో విభాగాల వారీగా రూ.కోట్లలో వ్యయం చేస్తున్నా ఆ మేరకు ప్రజలకు కనీస మేలు కూడా జరగడంలేదు. నిధులు ఏమవుతున్నాయో కూడా తెలియడంలేదు.

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్

- అవస్థల్లో ప్రజలు.. పట్టించుకోని పుర పాలకులు
- పట్టణాల్లో జనాభాకు అనుగుణంగా లేని సౌకర్యాలు
- పన్నుల వసూళ్లపైనే శ్రద్ధ.. వసతుల కల్పనలో అశ్రద్ధ



వర్షానికి చిలకలూరిపేట హైవేపై నిలిచిన నీరు (ఫైల్‌ఫొటో)

తాగునీరు.. రోజు మార్చి రోజు

చిలకలూరిపేట: చిలకలూరిపేటలో మంచినీటి సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రోజు మార్చి రోజు మాత్రమే నీటి సరఫరా జరుగుతున్నది. ఏటా చెరువులను నింపడానికి సుమారు రూ.కోటిన్నర వ్యయం చేస్తున్నా ప్రజల కష్టాలు తీరడంలేదు. అసంపూర్తిగా ఉన్న అమృత్ పథకం పూర్తయితే నీటి సమస్య పరిష్కారం అవుతుంది. అయితే దీనిని పూర్తి చేయడంలో అటు పాలకులు, ఇటు అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. ఇక పట్టణంలో జనాభా సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేవు.

ప్రస్తుతం జనాభా	1,41,000
పార్కులు	5 (రెండు నిరుపయోగం)
మురుగుదొడ్లు	7
డంపింగ్ యార్డు	1
సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు	2
మురుగునీటి శుద్ధి కేంద్రాలు	లేవు



నిలిచిపోయిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం

పారుదల లేక కాల్వలో నిలిచిపోయిన మురుగునీరు



బాలయ్య నగర్‌లో గ్రావెల్ రోడ్డు

విలీన ప్రాంతాల్లో వెతలు

నరసరావుపేట: మున్సిపాల్టీలో శివారు ప్రాంతాలను విలీనం చేశారు. అయితే మౌలిక వసతుల కల్పన లేదు. తాగునీరు, వీధి దీపాలు, రహదారులు, మురుగు కాల్వల వసతి లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లకు విలీన ప్రాంతాలు నోచుకోవడంలేదు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేక రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. తాగు నీటి సరఫరా జరగడంలేదు.

ప్రస్తుత జనాభా	1,64,000
ఉద్యానవనాలు	ఏడు అధ్వానం
పబ్లిక్ టాయిలెట్లు	నాలుగు బ్లాక్‌లు
భూగర్భ డ్రెయినేజీ పథకం	నిరుపయోగం
డంపింగ్ యార్డులు	ఒకటి
నీటి సంరక్షణ వ్యవస్థ	లేదు

తాగునీటి కష్టాలు..

వినుకొండ: వినుకొండలో ప్రధానంగా తాగునీరు, డ్రెయినేజీ, లోవోల్టేజీ, వీధి లైట్ల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న జన సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలం అవుతున్నారు. తాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఏషియన్ బ్యాంకు సహకారంతో రూ.159 కోట్లతో చేపట్టిన పనులు 2018 నుంచి నిలిచిపోయాయి. పంచాయతీ హయాంలో నిర్మించిన డ్రెయినేజీ వ్యవస్థే నేటికి అలాగే ఉంది. దీంతో పారుదల లేక కాల్వల నిండి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది.

జనాభా	70 వేలు
తాగునీటి పథకాల	1 (మరొకటి అవసరం)
పబ్లిక్ టాయిలెట్లు	4 (మరో రెండు అవసరం)
డంపింగ్ యార్డు	1 (మరొకటి అవసరం)
ఉద్యానవనాలు	2(మరో మూడు అవసరం)
శ్మశానాలు	1 (మరో రెండు అవసరం)



మాచర్ల పట్టణంలో తాగునీటి దుస్థితి

శివార్లలో అన్నీ సమస్యలే..

మాచర్ల: పట్టణంలోని శివారు కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. శివారు కాలనీల్లో సీసీ రోడ్లు లేవు. తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2011లో 57,296 మంది జనాభా ఉండగా ప్రస్తుతం 72 వేలకు చేరారు. అయితే ఆ స్థాయిలో సౌకర్యాలు లేవు. బుగ్గవాగు మంచినీటి పథకం ఇంకా ప్రతిపాదన దశలోనే ఉంది. పట్టణంలో సుమారు 400 వరకు వీధి దీపాలు వెలగడం లేదు. పట్టణం మొత్తమ్మీద ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేదు.

తాగునీటి పథకాలు	లేవు(రెండు అవసరం)
ఉద్యానవనాలు	రెండున్నా నిరుపయోగం (3 అవసరం)
మరుగుదొడ్లు	లేవు(ఐదు అవసరం)
వరద కాలువలు	1(రెండు అవసరం)
డంపింగ్ యార్డులు	1(మరొకటి అవసరం)



సత్తెనపల్లిలో సమస్యగా ఉన్న ప్రధాన మురుగు కాలువ

పార్కులు	1 (మరొకటి అవసరం)
మరుగుదొడ్లు	4 మరో రెండు అవసరం)
మురుగు కాల్వలు	180 కిలోమీటర్లు
వరద కాల్వలు	ఏడున్నర కిలోమీటర్లు
డంపింగ్ యార్డులు	2(మరొకటి అవసరం)
రక్షిత మంచినీటి పథకాలు	2(మరో రెండు అవసరం)

ముంపు.. ముప్పు

సత్తెనపల్లి: వర్షాలు పడినప్పుడల్లా పట్టణంలోని నాగన్నకుంట ముంపునకు గురై ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఓ మోస్తరు వర్షాలకే కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. సరైన ప్రణాళిక లేక కొన్ని ప్రాంతాల్లో కనీస వసతులు కొరవడ్డాయి. సుందరయ్య కాలనీ నుంచి నరసరావుపేట రోడ్డు వరకు ఉన్న కాల్వ వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ట్రాఫిక్, వీధి దీపాలు, తాగునీరు, డ్రెయిన్ల సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అంశాలు	ఉన్నవి/అవసరం
తాగునీటి పథకాలు	1/1
ఉద్యానవనాలు	0/2
మరుగుదొడ్లు	3/3
డంపింగ్ యార్డులు	1/1
నీటిసంరక్షణ వ్యవస్థ	1/1



పిడుగురాళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలు

కాలనీలు జలమయం..

పిడుగురాళ్ల: పిడుగురాళ్లలో ఓ మోస్తరు వర్షానికే పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. వరద కాల్వల ఏర్పాటు అవసరం ఉన్నా పాలకులు పట్టించుకోవడంలేదు. వీధి దీపాలకు, సైడ్ డ్రెయిన్స్‌కు నోచుకోని వీధులెన్నో ఉన్నాయి. పట్టణంలో 72,000మంది జనం ఉన్నా ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పన లేదు.

జగన్ పాలనలో రాష్ట్రం
50 ఏళ్లు వెనక్కి
● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

8

దేశం కోసమే నెహ్రూ కుటుంబం బతికింది
● ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహాల ఆవిష్కరణ సభలో షర్మిల

హత్య కేసులో నిందితుల అరెస్టు

6

రూ.3.97 లక్షల నకిలీ ఇంజన్ ఆయిల్ స్వాధీనం



పెదకాకాని: సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యవరప్రసాద్, వేదికపై వైఎస్ షర్మిల

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నరసరావుపేట కల్చరల్, నవంబరు, 14. జిల్లాలోని అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ రిక్రూట్‌మెంట్(ఎస్‌జీటీ) పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీ స్టడీ సర్కిల్ జిల్లా అధికారి బి.శివనాగేశ్వరరావు తెలిపారు. శిక్షణకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 200 మంది అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణ, స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే ఉచిత శిక్షణకు అర్హులన్నారు. టీటీసీ మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు. శిక్షణా తరగతులు నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 9010497267 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కబ్జా చేస్తే.. కటకటాలే

- భూ కబ్జాలపై ఉక్కుపాదం
- తప్పించుకునే వీలులేకుండా పగడ్బందీ చట్టం
- నిందితులకు అత్యంత తీవ్రమైన శిక్షలు.. ఆస్తుల సీజ్
- బాధితులకు భారీగా పరిహారం చెల్లింపునకు చర్యలు
- భూ కబ్జా కేసుల కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కోర్టులు
- నేడు అసెంబ్లీలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తున్నది. భూకబ్జాలకు పాల్పడ్డారో ఖతం అయినట్టే. ల్యాండ్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రభుత్వం పగడ్బందీ చట్టాన్ని తీసుకొస్తుంది. భూ కబ్జాదారుల మెడకు ఉచ్చు బిగించబోతోంది. అర్థబలం.. అంగబలంతో రెచ్చిపోయిన ల్యాండ్ మాఫియా కట్టడే లక్ష్యంగా సామాన్యుల ఆస్తులకు రక్షణ కవచం లాగా నూతన ఆక్రమణల నిషేధిత చట్టాన్ని ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందుకు సంబంధించి అసెంబ్లీలో శుక్రవారం ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ఇష్టారీతిన భూకబ్జాలతో ప్రజ, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని గుంటూరు జిల్లాతో పాటు అటు పల్నాడు, ఇటు బాపట్ల జిల్లాల్లో ల్యాండ్ మాఫియాకు సంబంధించి అక్రమార్కులు రాజకీయ పలుకుబడితో పాటు పోలీసులను గుప్పెట్లో పెట్టుకుని యథేచ్ఛగా తమ కార్యకలాపాలను కొనసాగించేవారు. ఎవరైనా వీరి అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేసేవారు. కోర్టులకు వెళితే ఎన్నేళ్లకు కేసు తేలుతుందో అర్థం కాక కొందరు, కోర్టులకు వెళ్లలేక మరికొందరు, కోట్ల ఖరీదైన ఆస్తులను వదులుకోలేక ఇంకొందరు అలాగని న్యాయపోరాటం చేయలేక సతమతమవుతూ వచ్చారు. అంతేకాక ఎవరైనా వారిని ధీటుగా ఎదుర్కొని పోలీసులకు ఫిర్యాదు చేసినా చట్టంలో ఉన్న లొసుగులను అడ్డుపెట్టుకుని స్టేషన్ బెయిల్‌పై వచ్చి ఆయా భూ యజమానులకు హెచ్చరికలు చేస్తూ తమ భూకబ్జాల పర్వం కొనసాగిస్తూ వచ్చారు. కొన్ని సందర్భాల్లో ల్యాండ్ మాఫియా, పోలీసులు చేతులు కలిపి భూ కబ్జాలను తెలివిగా సివిల్ వివాదం అంటూ ఉన్నతాధికారులను, చివరకు చట్టాన్ని సైతం తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసి కోట్ల ఖరీదైన అమాయకుల భూములను

(మిగతా 6వ పేజీలో...)



హోంగార్డులూ.. ఉపాధి కూలీలే

- ఒకరికి రెండు జాబ్‌కార్డులతో చెల్లింపులు
- రూ.24.99 లక్షల నిధులు దుర్వినియోగం
- నకరికల్లు ప్రజావేదికలో వెలుగుచూసిన అక్రమాలు
- అవినీతికి పాల్పడితే కఠిన చర్యలన్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

నకరికల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వలసలు నివారణ, కూలీలకు ఉపాధి కల్పించాల్సిన ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంలా మారింది. ఇష్టం వచ్చినట్లుగా, ఎవరూ గుర్తించరని యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ ఉపాధి నిధులను దుర్వినియోగం చేసేస్తున్నారు. సామాజిక తనిఖీ బృందాలు ఎక్కడికక్కడ ప్రజా వేదికల ద్వారా అక్రమాలను గుర్తిస్తున్నా ఉపాధిలో అవినీతి తగ్గకపోగా పెరిగిపోతూ వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.9.19 కోట్ల పనులపై సామాజిక తనిఖీ జరగ్గా రూ.24.99 లక్షలు దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించింది. గురువారం నకరికల్లు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో ఉపాధి అక్రమాలను సామాజిక తనిఖీ బృందం బహిర్గతం చేసింది. మండలంలో 16వ విడత సామాజిక తనిఖీ బృందాలు ఈ నెల 1 నుంచి 18వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించగా పలు అక్రమాలను గుర్తించాయి. ఆయా అక్రమాలు ఇలా ఉన్నాయి. చాగల్లులో గ్రామసభ తీర్మానాలు లేకుండా పనులు చేసినట్లు, చెక్ మెజర్‌మెంట్ చేయకుండానే చెల్లింపులు చేశారు. మస్టర్ల తనిఖీలు లేకుండా చెల్లింపులు జరిగాయి. బాలాజీనగర్ తండాలో హోంగార్డు శంకర్‌నాయక్ పేరుతో నిధులను స్వాహా చేశారు. నకరికల్లులో రూ.34 వేల విలువైన పనుల రికార్డులను సామాజిక తనిఖీ బృందానికి ఇవ్వలేదు. చల్లగుండ్ల, దేచవరంలో మొక్కలు లేకుండా చెల్లింపులు చేశారు. చీమలమర్రిలో వలంటీర్లు తిరుమలహూడి శివరామకృష్ణ, నల్లగట్ల వీరాంజనేయులు, కొత్తబోయిన కోటేశ్వరరావు, సాతులూరి పాపారావు, అంగన్‌వాడీ ఆయా పద్మ, వీఆర్‌ఏ కొత్తపల్లి శ్రీను పేర్లతో ఉపాధిపనులు చేసినట్లు రికార్డులను సృష్టించి నిధులు స్వాహా చేశారు. చేయని ఇంకుడు గుంతలు, రూఫ్‌వాటర్ పనులకు చెల్లింపులు జరిగాయి. రూపెనగుంట్లలో గ్రావెల్ లేకుండా రూ.87 వేలు, మొక్కలు లేకుండా రూ.1.87 లక్షలు చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. ప్రోగ్రాం అధికారి ఎంపీడీవో సంతకం లేకుండా ఎం బుక్‌లో పాస్ ఆర్డర్లు లేకుండా చెల్లింపులు చేసినట్లు గుర్తించారు.



నకరికల్లులో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

శాఖాపరమైన చర్యలు

ఉపాధి హామీ పనులకు సంబంధించి గుర్తించిన అక్రమాలపై సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. నిధులు దుర్వినియోగమైతే ఆ నిధులను తిరిగి ప్రభుత్వానికి జమ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీకి సంబంధించి ప్రతి పైసా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండేలా, ఖర్చు చేసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

ముఖ్యమంత్రిని కలసిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్



రొంపిచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరిని కలిశారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నారు.

ఏఎన్‌యూ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, సెలక్షన్ కమిటీ సభ్యులు

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరిగిన ఏఎన్‌యూ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీల్లో బాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు టోర్నమెంట్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.త్రివేణి, ఎం.కావేరి, సీహెచ్ హేమలత, నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విద్య ఏఎన్యూకు చెందిన వి.పుష్ప, టి.ప్రమీల, తెనాలి జేఎంజే కాలేజీకి చెందిన డి.హేమలత, పి.హేమలత, నరసరావుపేట విక్టరీ డిగ్రీ కాలేజీకి చెందిన జి.హర్షిత, నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన కె.ఆదిలక్ష్మి, ఒంగోలు డీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీకి చెందిన కె.రత్నకుమారి, గుంటూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీకి చెందిన పి.యమున, ముప్పాళ్ల ధనలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన కె.శాంతకుమారి జట్టుకు ఎంపిక అయ్యారన్నారు. స్టాండ్ బైగా నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన పి.లక్ష్మి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన ఎస్.నీలిమా, బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన ఎ.గోపి శివప్రియ ఎంపిక అయ్యారు. జట్టును ఎంపిక చేయడానికి యూనివర్సిటీ సెలక్షన్ కమిటీ సభ్యులుగా సీహెచ్ వెంకట్రావు, పి.గణేష్, ఎ.అరుణ సుజాత, టోర్నమెంట్ అబ్జర్వర్‌గా డాక్టర్ డి.సూర్యనారాయణరావు వ్యవహరించారు. జట్టుకు ఎంపికైన సభ్యులు ఈ నెల 28న తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీ కారైకుడిలో జరగబోయే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయ మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల పీడీ ఈదర ఆదిబాబు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నాసరయ్య, వీర రాఘవులు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, సయ్యద్ మహమ్మద్, ఎం తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ఎక్కడ చదివినా స్థానికులుగానే పరిగణించాలి

గుంటూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు దేశంలో ఏ రాష్ట్రంలో ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసినా స్థానికులుగానే పరిగణించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్(ఏపీఎంపీఏ) తరఫున అధ్యక్షులు డాక్టర్లు ఆలా వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారు వై.నాగూర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు గురువారం లేఖ రాసినట్లు తెలిపారు. ప్రస్తుత నిబంధనలు కొనసాగినట్లయితే అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థులు పీజీ సీట్లు పొందే అర్హత కోల్పోతారని అన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులెవరూ ఆల్ ఇండియా కోటా ద్వారా ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చేయడానికి ఇష్టపడరని తెలిపారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆల్ ఇండియా కోటాకు కేటాయిస్తున్న దాదాపు 450 ఎంబీబీఎస్ సీట్లు వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రస్తుతం ఉన్న జీవోను మార్చాలని కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 586.20 అడుగులు ఉంది. ఇది 301.35 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6556 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,424 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 31,280 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 31,280 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

- స్మార్ట్ ఫోనుకు బానిసలుగా మారొద్దు
- జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక
- ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న డీఈవో రేణుక, డీపీవో నాగసాయి కుమార్

గుంటూరు(తూర్పు), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి(డీ ఈవో)సీవీ రేణుక అన్నారు. గురువారం స్థానిక అరండల్‌పేటలోని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ, డీపీవో బి.వి.నాగ సాయి కుమార్, కన్నా విద్యా సంస్థల అధినేత కన్నా మాస్టారు. గుళ్ళపల్లి సేవా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్ళపల్లి సుబ్బారావులతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం డీఈవో రేణుక మాట్లాడుతూ ముఖ్యంగా డిజిటల్ యుగంలో మొబైల్ లేకుండా జీవించడం లేదని, దీంతో రేడియేషన్ బారినపడి పిల్లల జ్ఞాపకశక్తి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మొబైల్‌కు బానిసలుగా మారద్దని హితవు పలికారు. జ్ఞానం సంపాదించడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. వి. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 97 శాఖ, 32 గ్రామీణ గ్రంథాలయాలు, 103 పుస్తక పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో 51 వేల పుస్తకాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. డీపీవో బి. వి.నాగసాయికుమార్, కన్నా మాస్టారు మాట్లాడుతూ పుస్తక పఠనంతో క్రమశిక్షణ, విలువలు పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గుళ్ళపల్లి సేవా సంస్థ మేనేజింగ్ ట్రస్టీ గుళ్ళపల్లి సుబ్బారావు రూ.10 వేల విలువ కలిగిన పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందించారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కందుల యూస్సీ లక్ష్మీ, ప్రముఖ వ్యాఖ్యాత సుజాత, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

పొన్నూరుటౌన్, నవంబరు14: ములుకుదురు గ్రామంలో ఇటీవల జరిగిన హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెనాలి డీఎస్పీ పి.జనార్దనరావు తెలిపారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నిందితులను అరెస్టు చూపి హత్య కేసు వివరాలను వెల్లడించారు. ములుకుదురు గ్రామానికి చెందిన దేవరాజ్ విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే పని చేసేవాడు. ములుకుదురు గ్రామానికే చెందిన మాధవ్ అనే యువకుడితో దేవరాజ్‌కు విభేదాలు ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన జ్యోతి అనే వివాహితతో దేవరాజ్ వివాహేతర సంబంధం నేపథ్యంలో చనువుగా ఉన్నాడు. దీంతో ఆగ్రహానికి గురైన మాధవ్ తన మిత్రుడి సహాయంతో దేవరాజ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందు కోసం తన మిత్రుడు మణికంఠకు రూ. 2 లక్షలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. మణికంఠ అదే గ్రామానికి చెందిన యువకులు జోసఫ్, సాయి, రాజు అనే యువకులను సంప్రదించి డబ్బులు ఆశ చూపి హత్యకు సిద్ధమైయ్యారు. ఈ నెల 9వ తేదీ రాత్రి జ్యోతి ఇంటికి వచ్చిన దేవరాజ్ కళ్లలో కారం చల్లి పంట పొలాల్లోకి తీసుకెళ్లి హత్య చేశారు.దేవరాజ్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులతోపాటు వారికి సహకరించిన మరో ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్సై జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేస్తే.. కటకటాలే

(5 పేజీ తరువాయి)

అప్పనంగా కొట్టేసిన ఉదంతాలెన్నో ఉన్నాయి.

గడిచిన ఐదేళ్లల్లో రెచ్చిపోయిన భూమాఫియా..

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో భూమాఫియా రెచ్చిపోయింది. అధికార పార్టీ నేతలు, పోలీసులను తమ గుప్పెట్లో పెట్టుకుని ఖరీదైన భూములను కొట్టేశారు. ఒకవైపు ప్రభుత్వ అసైన్డ్ భూములు, చుక్కల భూములు వంటి వాటిని సైతం తమ మాయాజాలంతో చేతులు మార్చుకున్నారు. పేదలు, అమాయకుల ఆస్తులను తప్పుడు రిజిస్ట్రేషన్లతో వశం చేసుకున్నారు. ప్రశ్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ సహా తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన రాష్ట్ర కార్యాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించారు. మరోవైపు లోకేశ్ కూడా తన నివాసంలో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్నారు. గడిచిన ఐదు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతానికి పైగా ల్యాండ్ మాఫియా సాగించిన భూకబ్జాలపైనే కావడంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. మరోవైపు నాడు అధికారాన్ని వెలగబెట్టిన వారిలో అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో ఉన్న నాయకులు, వైసీపీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను తమ పేరిట, అనుయాయుల పేరిట, బినామీ పేర్లతో కొట్టేశారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం ల్యాండ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించుకుని పకడ్బందీగా భూకబ్జా నిషేధిత చట్టాన్ని తీసుకొచ్చింది. దీనిపై ఈ నెల 4న జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రి మండలి ఆమోదముద్ర కూడా వేసింది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిని ఆమోదించనున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది నెలల్లో ఈ చట్టం అమల్లోకి రాబోతుంది.

ఎస్పీ గ్రీవెన్స్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

భూకబ్జాలకు సంబంధించి ప్రతి సోమవారం బాధితులు పెద్దసంఖ్యలో గుంటూరు, బాపట్ల, పల్నాడు ఎస్పీ కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌లకు పోటెత్తుతున్నారు. ఎస్పీల గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూకబ్జాలకు సంబంధించినవే ఉంటుండటం గమనార్హం. ఎస్పీ కార్యాలయం నుంచి సంబంధిత స్టేషన్‌లకు వెళ్ళినా పోలీసులు సివిల్ వివాదమని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో బాధితుల గోడు వినేవారే కరువవుతున్నారు. కోట్ల ఖరీదైన సామాన్యుల భూములను చట్టంలో ఉన్న లొసుగులను, రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని కొట్టేశారు. సంచలనం సృష్టించిన గుంటూరు శ్యామలానగర్‌లో జరిగిన భూకబ్జా వ్యవహారం మొదలు ఇటీవల వరకు ఎన్నో ఉదంతాలు చోటుచేసుకున్నాయి. శ్యామలానగర్‌లో జరిగిన భూకబ్జా వ్యవహారంలో ఏకంగా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది సస్పెన్షన్‌కు గురైన వ్యవహారం తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే. ఆ తర్వాత గుంటూరు పలకలూరు రోడ్డులోను ఇదే తరహాలో అనేక భూకబ్జా ఘటనలు చోటుచేసుకున్నాయి.

ఆరు నెలల్లోనే విచారణ పూర్తయ్యేలా చట్టం

అమాయకులు, వృద్ధులు, ఎన్ఆర్ఐల భూములపై కన్నేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసి వివాదం సృష్టిస్తే కోర్టుల చుట్టూ తిరగలేక వారే దారికి వస్తారులే అని ఇప్పటిదాకా భూములు కొల్లగొట్టిన ల్యాండ్ మాఫియా ఆటలు ఇక సాగవు. కొత్తగా వస్తున్న ఈ చట్టం ప్రకారం ఏ వివాదమైనా ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇంతకు ముందు మాదిరిగా కేసు కొట్టేయడం కాదు. భూమి ఆక్రమించినట్లు తేలితే నిందితుడిపై కఠిన చర్యలు ఉండనున్నాయి. నిందితుడికి కనీసం 10 నుంచి 14 ఏళ్లకు తక్కువ కాకుండా జైలుశిక్ష విధించనున్నారు. అంతేకాదు ఆక్రమించిన భూమి విలువతో పాటు మూడు రెట్ల వరకు నిందితుడి నుంచి నష్ట పరిహారం వసూలు చేయనున్నారు. ఇందుకుగాను ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కోర్టుల్లో కేవలం భూ కబ్జా కేసులు మాత్రమే విచారించనున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఆయా కోర్టులే నేరుగా సుమోటోగా కేసులు విచారణ చేపట్టే అధికారాలు కూడా కల్పించనున్నారు. భూకబ్జాలకు పాల్పడే మాఫియాకు ఏ మాత్రం అవకాశం, లొసుగులకు ఆస్కారం లేకుండా నూతన చట్టాన్ని తీసుకురాబోతున్నారు.

రూ.3.97 లక్షల నకిలీ ఇంజన్ ఆయిల్ పట్టివేత



నకిలీ ఇంజన్ ఆయిల్ పట్టుకున్న విజిలెన్స్ సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పి.శివాజీ

గుంటూరు సిటీ, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఇంజన్ ఆయిల్ నిల్వలను గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ కుమార్ పర్యవేక్షణలో గురువారం తాడేపల్లి మండలం మెల్లెంపూడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ ఇంజన్ ఆయిల్ నిల్వలను గుర్తించారు. విజయవాడలోని కృష్ణలంకకు చెందిన మాదాసు నాగ దుర్గ ప్రసాద్ అనే వ్యక్తి పలు ట్రేడర్ల వద్ద నుంచి రీసైక్లింగ్ చేసిన ఇంజన్ ఆయిల్ కొనుగోలు చేసి వాటిని కొత్త వాటిలా ప్యాక్ చేసి మార్కెటింగ్ చేస్తున్నాడు. రీసైక్లింగ్ చేసిన ఇంజన్ ఆయిల్‌ను 5, 3, 1, అర లీటర్ల డబ్బాల్లో నింపి వాటికి క్యాస్ట్రాల్, బజాజ్, హీరో, హోండా మొదలగు ప్రముఖ కంపెనీల స్టిక్కర్లు వేసి నకిలీ ఇంజన్ ఆయిల్‌ను మార్కెట్లో అక్రమంగా విక్రయిస్తున్నాడు. ప్యాకింగ్‌కు కావాల్సిన డబ్బాలు, లేబుల్స్‌ను కలకత్తా నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా తెప్పించుకుంటున్నారు. విజిలెన్స్ అధికారుల దాడుల్లో రూ.3,97,950 విలువ చేసే 1280 లీటర్ల నకిలీ ఇంజన్ ఆయిల్ లభ్యం అయినట్లు సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పి.శివాజీ వెల్లడించారు. మాదాసు నాగ దుర్గాప్రసాద్, అతనికి సహకరించిన వారిపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.60,000 విలువ చేసే ప్యాకింగ్ మెటీరియల్, ఆయిల్ గన్స్, ఆయిల్ ఫిల్లింగ్ మిషన్, క్యాప్ ప్రెస్సింగ్ మిషన్, మెజరింగ్ జార్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉన్నత వైద్యులుగా ఎదిగి సమాజ సేవ చేయాలి



వైద్య విద్యార్థికి యాప్రాన్ అందజేస్తున్న పొదిల ప్రసాద్

గుంటూరు మెడికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎన్నారై, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పొదిల ప్రసాద్ ఉద్బోధించారు. గురువారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన 2024-25 బ్యాచ్ మెడిసిన్ విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు 'లూమినా 24'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ అధ్యక్షత వహించారు. దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన గుంటూరు వైద్య కళాశాలలో మెడిసిన్ చదవడం గొప్ప అదృష్టంగా భావించాలని డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ప్రజాధనంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో చదుకొని వైద్యులుగా ఎదిగిన తర్వాత సమాజానికి ఏదో ఒక రూపంలో తిరిగి తమ వంతు సేవలు అందించాలని ఆయన కోరారు. జీఎంసీ, జీజీహెచ్ అభివృద్ధికి కళాశాల పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వైట్‌కోట్ సెర్మనీ నిర్వహించారు. జింకానా తెలకచర్ల ట్రస్ట్ సౌజన్యంతో 250 మంది మెడికోలకు యాప్రాన్ (వైట్‌కోటు)లను డాక్టర్ పొదిల ప్రసాద్, జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ పీవీ హనుమంతరావు, డాక్టర్ వి. బాలభాస్కరరావు అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాసక్తి పెంచడమే లక్ష్యం

- ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ



గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి ఇంటర్నెట్ యుగంలో పిల్లల్లో పుస్తక పఠనాసక్తి తగ్గిపోయింది. ప్రతీ దానికి గూగుల్‌లో వెతుకుతున్నారు. దీని వలన వారికి వివిధ రంగాలపై అవగాహన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో పిల్లల్లో పుస్తక పఠనాసక్తి పెంచడమే లక్ష్యంగా గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తెలిపారు. గ్రంథాలయాల వారోత్సవాల లక్ష్యంపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఫటా ఫట్

గ్రంథాలయాల ఉనికికి ముప్పు వాటిల్లుతున్న ప్రస్తుత తరుణంలో దానిని ఎదుర్కోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

కార్యదర్శి: ప్రతి ఆదివారం వుయ్ లవ్ రీడింగ్ (చదవడం మాకు ఇష్టం) అనే కార్యక్రమాన్ని అన్ని గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాం. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి స్పందన కూడా బాగుంది.

వారోత్సవాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు?

కార్యదర్శి: 15న పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదకద్రవ్యాలపై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనాలు, సదస్సులు, రచయితల సందేశాలు, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, ఆటల పోటీలు, 19న మహిళలకు రంగవల్లి, అల్లికల పోటీలు, 20న సామూహిక స్వీయ పఠనం కార్యక్రమాలను నిర్వహించనున్నాం.

డిజిటల్ గ్రంథాలయాల కాన్సెప్ట్ ఏమిటి?

కార్యదర్శి: డిజిటల్ గ్రంథాలయాలంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని లైబ్రరీలను ఇంటర్‌లింకప్ చేయడం. దాంతో ఒక గ్రంథాలయంలో పొందలేకపోయిన సమాచారాన్ని వేరే దాంట్లో డిజిటల్ రూపంలో ఇక్కడి నుంచే పొందవచ్చు.

ఎలాంటి పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి?

కార్యదర్శి: గ్రంథాలయాలంటేనే చరిత్రకి అద్దం పడతాయి. దశాబ్దాల నాటి దినపత్రికలు. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమయ్యే పుస్తకాలు, స్టడీ మెటీరియల్ వంటివి అందుబాటులో ఉన్నాయి. వందల సంఖ్యలో పాఠకులు ఉదయం వచ్చి సాయంత్రం వరకు గ్రంథాలయాల్లో ఉండి పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. చాలామంది ఉద్యోగాలు సంపాదించిన సంఘటనలు ఉన్నాయి.

డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు(ఎస్‌జీటీ) అర్హులైన ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డీడీ కె.మయూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబరు నెల 17వ తేదీ లోగా బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు 2 నెలలు పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపండ్, స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టెట్ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. టీటీసీలో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీ నుంచి శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, టీటీసీ మార్కు లిస్టులు, టెట్ మార్కులిస్టులు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 1,00,000 లోపు ఉండాలి) ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచి ఈ నెల 17 తేదీలోగా రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం బీసీ స్టడీ సర్కిల్ 0863- 2358071 ను సంప్రదించాలని సూచించారు.

లక్నోకు ప్రత్యేక గరీబ్ రథ్ రైలు

- గయ, కాశీ, అయోధ్య వెళ్లే యాత్రికులకు ఉపయోగకరం

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గయ, వారణాసి(కాశీ), అయోధ్య తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించే ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు మీదగా గరీబ్ రథ్ రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ప్రకటించింది. ఈ నెల 15, 22(శుక్రవారం) తేదీల్లో నంబరు. 07084 సికింద్రాబాద్ - లక్నో ప్రత్యేక రైలు రాత్రి 7.05కి బయలుదేరి 11.35కి గుంటూరు, ఆదివారం వేకువజామున 4.30కి గయ, ఉదయం 9.15కి వారణాసి, మధ్యాహ్నం 1.35కి అయోధ్య, సాయంత్రం 6 గంటలకు లక్నో చేరుకుంటుంది. నంబరు. 07083 లక్నో - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో(సోమవారం) ఉదయం 9.50కి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు అయోధ్య, సాయంత్రం 5.30కి వారణాసి, రాత్రి 10.50కి గయ, బుధవారం ఉదయం 7.55కి గుంటూరు, మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మొత్తం ఏసీ త్రీటైర్ బోగీలతో ప్రయాణిస్తాయి.

మోటార్ సైకిల్‌పై నుంచి పడి అధ్యాపకురాలు మృతి

మేడికొండూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళ్తూ కిందకు పడిపోయి అధ్యాపకురాలు మృతి చెందిన సంఘటన మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ఆరో మైలు కాలనీ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గుంటూరు నగర పరిధిలోని నల్లపాడుకు చెందిన దాసరి సుష్మిత (49) మాచర్లలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ఆమె బస్సులో వెళ్లి వస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు నల్లపాడులో ఆగకపోవడం వల్ల పేరేచర్లలో బస్సు ఎక్కేందుకు తన కుమారుడు దాసరి ధనుష్ శ్రీవత్సవతో కలసి బుల్లెట్ మోటార్ సైకిల్‌పై బయలుదేరి పేరేచర్లకు వస్తున్నారు. మార్గమధ్యలో 6వ మైలు కాలనీ వద్ద ఆమె ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ వెనుక చక్రంలో సుష్మిత చీర చుట్టుకుపోయింది. దీనిని గమనించకుండా మోటార్ సైకిల్ వెళ్తుండటంతో ఆమె మోటార్ సైకిల్ పైనుంచి కిందకు పడిపోయింది. సుష్మిత తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 41.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి నీటి ప్రవాహం నిలిచి పోయింది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు.

జోన్ డైరీ

● కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవం శుక్రవారం సాయంత్రం 7 గంటలకు జరుగుతుందని ఈవో పీ. సునీల్ కుమార్ తెలిపారు.

● దుర్గి మండలంలోని ధర్మవరంలో వేంచేసియున్న శ్రీహరిహర బాలనాగేంద్ర స్వామి 34వ వార్షిక మహోత్సవాలను ఈనెల 17 నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొని అధిక సంఖ్యలో విచ్చేసి విజయ వంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

● సత్తెనపల్లి రూరల్ మండలంలోని గుడిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న మాతృశ్రీ అచ్చమాంబ పుల్లయ్య స్వామి వార్ల వార్షిక కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

గుంతలు లేని గురజాల దిశగా..

● రహదారుల మరమ్మతులకు రూ.3.75 కోట్ల మంజూరు
● జనవరి నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు
● ఎమ్మెల్యే యరపతినేని ప్రత్యేక చొరవ

పిడుగురాళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురజాల రహదారులకు మహర్దశ పట్టనున్నది. రాష్ట్రంలోని రహదారులపై ఎక్కడా గుంతలు కనిపించకూడదని సీఎం చంద్రబాబు ప్రకటించినట్లుగా గురజాల నియోజకవర్గంలో పనులు ప్రారంభమయ్యాయి. జనవరి నాటికి పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం గురజాల నియోజకవర్గానికి సుమారు రూ.3 కోట్ల 75 లక్షల నిధులు మంజూరు చేసింది.

నియోజకవర్గంలోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారులకు మొదట మరమ్మతులు ఆ తర్వాత కొత్త రహదారుల నిర్మించేందుకు అధికారులు ఇప్పటికే పనులు మొదలు పెట్టారు. గత వారం గురజాల పట్టణంలో గుంతలు లేని రహదారుల కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాగల రెండు నెలల్లో గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మంజూరైన నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలు లేని రహదారులుగా మారనున్నాయి.


పనులను పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు (ఫైల్)


గురజాల పట్టణంలో రోడ్డుకు పనులు జరుగుతున్న దృశ్యం, గుత్తికొండ-గుళ్లపల్లి రహదారికి మరమ్మతులు

ఎక్కడ నుండి ఎక్కడికి..

జానపాడు నుండి పందిటివారిపాలెం వరకు రూ.1.5 కోట్లు మంజూరు కాగా, పిడుగురాళ్ల మండలంలో రూ.35 లక్షలతో బ్రాహ్మణపల్లి నుంచి చెన్నాయపాలెం, తుమ్మలచెరువు టోల్‌గేట్ సమీపం నుంచి పెదగార్లపాడు, చినగార్లపాడు వెళ్లే నాలుగు రోడ్ల కూడలి వరకు, జూలకల్లు క్రాస్ రోడ్డు నుండి పందిటివారిపాలెం వరకు, పిడుగురాళ్ల నుండి గోవిందాపురం, కోనంకి పోవు రహదారికి, దాచేపల్లి మండలంలో సుమారు రూ.45 లక్షలతో దాచేపల్లి నుంచి ఇరికేపల్లి, దాచేపల్లి నుంచి గోగులపాడు, గురజాల మండలంలో రూ.85 లక్షలతో గురజాల నుంచి మాడుగుల రోడ్డు వరకు, గురజాల నుంచి పులిపాడు వరకు, పులిపాడు నుంచి సమాధానంపేట, పులిపాడు నుంచి శ్రీనివాసపురం, మాచవరం మండలంలో కొత్తగణేశునిపాడు నుంచి గోవిందాపురం, పిల్లుట్ల నుంచి శ్రీరుక్మిణీపురం వరకు ఆర్ అండ్‌బీ రహదారులపై వున్న గుంతలు పూడ్చి కొత్త రహదారుల వేసేందుకు అధికారులు పనులను ఇప్పుడిప్పుడే మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం ప్రధాన రహదారుల నిర్మాణం, మరమ్మతులపై దృష్టిసారించి ప్రజలకు, వాహనదారులకు ప్రయాణ కష్టాలు తొలగించేందుకు కృషి చేస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో నిధులు మంజూరై, పనులు వేగంగా సాగు తుండంతో నియోజకవర్గంలోని ఆయామండలాల ప్రజలు ఎమ్మెల్యే యరపతినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

- ఎమ్మెల్యే యరపతినేని



నియోజకవర్గంలో అన్ని ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలు లేని రహదారులుగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లుగా జనవరి నాటికి ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు పూర్తిచేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ముఖ్య ప్రాతిపదికన దశల వారీగా అన్ని రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేయిస్తా.



రాష్ట్ర శాసనసభ ఉప సభాపతిగా ఎన్నికైన రఘురామకృష్ణమరాజును గురువారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అసెంబ్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ గౌరవాన్ని, ప్రతిష్ఠను మరింత పెంచేలా సభా నిర్వహణను ముందుకు తీసుకువెళ్లాలని యరపతినేని సూచించారు.
- పిడుగురాళ్ల, (ఆంధ్రజ్యోతి)



మాచర్ల మండలంలోని బెల్లకొండవారిపాలెం గ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం పీఎం జన్‌మన్ కార్యక్రమం నిర్వహించనుండడంతో కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం పాఠశాలకు విచ్చేసి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో వరలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి తదితరులు పాల్గొన్నారు.
- మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఘనంగా బాలల దినోత్సవం

మాచర్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతలలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం హెచ్‌ఎం దుర్గాభవాని ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాలికలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాగర్ ప్లయిటెక్ ఏవియేషన్ ఎండీ కెప్టెన్ మమత, ఎస్‌ఎంసీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూళ్లలో బిగ్‌హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులకు రూ. 8 వేల విలువైన బహుమతులను అందించారు. కార్యక్రమంలో బిగ్‌హెల్ప్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి బాస్కరబాబు, హెచ్‌ఎంలు మేనగ రామారావు, షకీనా తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య రూపకాలను ప్రదర్శించారు. అలాగే పలు క్రీడా పోటీలలో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, హెచ్‌ఎం కాకాని వెంకట రమణ, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ వెంకట నాగరాజు పాల్గొన్నారు. అలాగే విద్యావిహార్ హైస్కూల్, శ్రీ కాకతీయ పబ్లిక్ స్కూల్, శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్లోనూ బాలల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

నేతల చిత్రపటాలకు

క్షీరాభిషేకం

అమరావతి, నవంబరు 14: రాష్ట్ర బడ్జెట్‌లో గత ప్రభుత్వం కంటే ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం అత్యధిక నిధులు కేటాయించటంతో హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఎస్సీ కాలనీలో టీడీపీ ఎస్సీ సెల్ నేత గొట్టెం రత్నకుమారి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కూటమి పాలనలో రాష్ట్రంలో దళిత, గిరిజన కుటుంబాలు సంతోషంగా ఉన్నాయంటూ రత్నకుమారి తెలిపారు.

దొడ్లేరులో ఆరోగ్య సర్వే

క్రోసూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరు గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది గురువారం అసంక్రమణ వ్యాధులపై సర్వే నిర్వహించారు. దుర అలవావల్ల వచ్చే వ్యాధుల గురించి మొత్తం 50 ప్రశ్నలతో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ సిరి చందన తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన స్త్రీ పురుషులకు, బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, 30 ఏళ్లు పైబడిన మహిళలకు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామి కళ్యాణం

అమరావతి, నవంబరు 14: మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీరుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కళ్యాణం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు పరాశరం రామకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో ప్రత్యేకమండపములో స్వామివార్ల కళ్యాణం జరిగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

మాచవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు రెండురోజుల పాటు జరుగనున్న శిక్షణా తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, పలుశాఖల అధికారులు హాజరుకాగా వారికి ఎంపీడీవో ఎంపీడీవో శ్రీనివాసరావు 2025-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శివ యాదవ్, ఈవోఆర్‌డీ వెంగళరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలి

రెంటచింతల,నవంబరు14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దుచేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వర ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమస్యపై ఈనెల 18 నుంచి అన్ని ప్రాంతాల్లో అధికారులు ప్రజలు వ్యక్తిగత అర్జీలు అందజేయాలని, అలాగే 27న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నా కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నేతలు హేస్ హాస్సేన్, కేశావత్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వనసమారాధన

దాచేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండల ఎరువులు, పురుగుమందులు, విత్తనాల అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం స్థానిక శివాలయంలో వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఏవో సంధ్యారాణి, మాచవరం ఏవో రావమ్మ, దాచేపల్లి ఏవో పాపకుమారి హాజరయ్యారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అక్కినపల్లి బాలయ్య, పీరమళ్ల వెంకటేశ్వర్లు, పసుమర్తి శ్రీను, రాచమడుగు ప్రసాదరావు, మాశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఎన్‌సీడీసీడీ 3.0'

దాచేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఎన్‌సీడీసీడీ (నాన్ కమ్యూనికల్ డిసీజెస్ అండ్ కమ్యూనికల్ డిసీజెస్) 3.0 కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అమూల్య, సహినా సుల్తానా ఆధ్వర్యంలో పలువురికి బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, స్త్రీలకు సంబంధించిన రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఎన్‌సీడీసీడీ3.0 కార్యక్రమంలో భాగంగా సర్వే వైద్యఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది సర్వే నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ హనుమకుమార్ పర్యవేక్షించారు. భట్లూరు, ఫణిదం, రామ కృష్ణాపురం గ్రామాల్లో సర్వే చేపట్టారు. 18 సంవత్సరాలు నిండిన వారందరికీ, ముఖ్యంగా స్త్రీలలో రొమ్ము క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. అనంతరం క్యాన్సర్ వ్యాధులపై మహిళలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రదీప్, కవిత, సాయి తేజారెడ్డి, గౌతమి, వీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో మాతృమరణం

వెల్దుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిడ్డను నవ మోసాలు తన గర్భంలో మోసిన తల్లి ప్రసవం అనంతరం బిడ్డకు జన్మనిచ్చి గిరిజన మహిళ మాతృమరణం (మెటర్నల్ డెత్) చెందిన సంఘటన మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... వెల్దుర్తి మండలం వజ్రాల పాడుతండాకు చెందిన జల్లా ఈదమ్మ (24) ప్రసవం నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల సమయంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చింది. 8 గంటలకు నార్మల్ డెలివరి జరిగి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటికే రక్తహీనతతో బాధపడుతున్న ఈదమ్మకు డెలివరీ అనంతరం వైద్య సిబ్బంది ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ అందించడంతో కొద్ది సేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లి మృత్యుఒడిలోకి వెళ్లింది. ఈదమ్మకు నలుగురు సంతానం ఉండగా ఇది ఐదో డెలివరీ కావడం పోషికాహార లోపంతో ఈ సంఘటన జరిగినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉదయబాను తెలిపారు. గిరిజన మహిళ ప్రసవం కోసం వచ్చి మృత్యువాత పడడం ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ.120 కోట్లు మంజూరు

మాచర్లటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గానికి రూ. 120 కోట్ల వ్యయంతో నాలుగు రోడ్లు మంజూరయ్యాయని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు తెలిపారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో మధుబాబు విలేకరులతో మాట్లాడుతూ బుగ్గవాగు మంచినీటి పథకం పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వరికపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అన్ని అనుమతులు తీసుకొచ్చారని, నిధులు మంజూరు కాగానే ఆయా పనులు ప్రారంభమవుతాయన్నారు. కూటమి పాలనలో ప్రజలు సుభిక్షంగా, సంతోషాలతో ఉన్నారని అన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పిడుగురాళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాతగణేమనిపాడు, కోనంకి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా ఆశోక్‌బాబు, సభ్యులు పలువురు పాల్గొన్నారు. అలాగే పిడుగురాళ్ల ఐసీడీఎస్ ఆధ్వర్యాన లెనిన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో, తుమ్మలచెరువులోని బోధి పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు.

ఉద్యమంగా సభ్యత్వ నమోదు

క్రోసూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదును ఓ ఉద్యమంలా చేపట్టాలని టీడీపీ కార్యకర్తలు, నేతలు ఉత్సాహంగా పాల్గొనాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంధ్రు కాశయ్య పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వాన్ని పొందిన పలువురికి గురువారం ఆయన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు లక్ష్యంగా నిర్ణయించారని, సభ్యత్వ నమోదులో క్రోసూరు మండలాన్ని జిల్లాలోనే నెంబర్ వన్‌గా నిలపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సలాం, కోటేశ్వరరావు,మైసూర్‌బాబు, యోహాన్, పూర్ణ, శివయ్య, లక్ష్మీనారాయణ, పాపారావు పాల్గొన్నారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రంలో

మార్పులు చేర్పులు

మాచర్లటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ ప్రజలు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో మార్పులు, చేర్పులకోసం పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలోని ఆయా విభాగంలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2017 సంవత్సరం నుంచి జన్మించిన వారి వివరాలకు సంబంధించిన పత్రాలను జనన, మరణ నమోదు విభాగంలో సమర్పించి ఆ తర్వాత ఈ సేవా కేంద్రం లేదా సచివాలయంలో సంప్రదించాలని ప్రజలకు కమిషనర్ సూచించారు.

నకరికల్లు పీఎస్‌లో ఎస్పీ తనిఖీ

నకరికల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు పోలీసు స్టేషన్‌ను గురువారం రాత్రి పల్నాడుజిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాకప్, స్టేషన్ పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు పలు సూచనలను చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

రెంటచింతల,నవంబరు 14(ఆంధ్రజ్యోతి):నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు కోరారు. వారంరోజుల నుంచి వివిధ సమస్యలపై సీపీఐ(ఎం) చేపట్టిన ప్రచార యాత్రలో వచ్చిన సమస్యలను ప్రస్తావిస్తూ గురువారం డీటీ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందచేశారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) డివిజన్ అధ్యక్షుడు మహేష్, పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి) : నిత్యవసర ధరలను నియంత్రించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సీపీఎం నేత గుంటుపల్లిబాలకృష్ణ అన్నారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా గురువారం ముప్పాళ్ళలో ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి తహసీల్దార్ ఎం భవానీశంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు..

ఆధునిక దేవాలయాలు

రాజుపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకోవాలని వక్తలు తెలిపారు. గురువారం స్థానిక శాఖాగ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని శాఖా గ్రంథాలయంలో గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వీరాంజమ్మ, కాంధ్రు కాశయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేట (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని గ్రంథాలయ అధికారి పీ.నాగరాజు అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, పలు పాఠశాలల్లో బాలల దినోత్సవంలో పాల్గొని గ్రంథాలయ విశిష్టతను వివరించారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వాణి పాల్గొన్నారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగాస్థానిక గ్రంథాలయంలో బాలల దినోత్సవం నిర్వహించారు.

దుర్గి(ఆంధ్రజ్యోతి):స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



గ్రావెల్ తవ్విన కొండను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

మైనింగ్ ప్రాంతాల్లో అధికారుల తనిఖీ

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం

మాచర్లటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'కొండలను మింగేశాడు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. మాచర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి ఆధ్వర్యాన మైనింగ్ అధికారులు అసిస్టెంట్ జియాలసిస్ట్ జే సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌కుమార్, సర్వేయర్ జయప్రకాష్‌లు కొత్తపల్లి పంచాయతీ పరిధిలో గ్రావెల్ తవ్వకాలు జరిగిన కొండను పరిశీలించారు. సర్వే చేయించి వచ్చిన నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి ఆంధ్రజ్యోతికి తెలిపారు. పరిశీలించిన అధికారుల్లో మండల సర్వేయర్ వై రమాపతి, ఆర్ఐ గన్నెబోయిన భాస్కర్ తదితరులు ఉన్నారు.


సర్వే జరిపిస్తాం.. నిగ్గు తేలుస్తాం.. ఈ విషయంపై దాచేపల్లి మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్ ప్రకాష్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల్లో మిషన్ ద్వారా సర్వే చేయించి ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు జరిగాయి, ఎంత గ్రావెల్ తరలిపోయింది, అనుమతులు ఉన్నాయా, లేదా అనే విషయాలపై నివేదిక తయారు చేయించి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.


మాచవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీ

● వివిధ కేసుల్లో రూ. 6 లక్షల అపరాధ రుసుం

మాచవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న పలువురిపై కేసులు నమోదుచేసి రూ.6.01 లక్షల అపరాధ రుసుం విధించారు. కొత్తగణేమనిపాడు, పిల్లుట్ల, పిన్నెల్లి, మోర్జంపాడు, కొత్తపాలెం, గోవిందాపురం, తురకపాలెం, మోర్జంపాడు తదితర గ్రామాల్లో 46 మంది అధికారులు, 138 మంది సిబ్బంది 50 బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ చౌర్యం, మీటరు ఉన్నప్పటికీ అనధికార విద్యుత్ వినియోగం వంటి వాటిపై కేసులు నమోదు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ రాంబట్లు తెలిపారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263కి ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ దాడుల్లో డీఈఈ కే రవికుమార్, వీరేశ్వరరావు, ఏఈలు కే కోటేశ్వరరావు, ఏ చంద్రశేఖర్, భగవాన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయం నిర్మాణానికి కేటాయించిన స్థలం

400 సిమెంట్ కట్టలు మాయం

● కాజేసిన వైసీపీ నేత ? ● ఐదేళ్లయినా రికవరీ చేయని అధికారులు

గురజాలటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ గ్రామంలో సచివాలయం నిర్మాణానికని 400 సిమెంట్ కట్టలు వచ్చాయి.. అయితే కట్టలన్నీ మాయమయ్యాయి. ఓ వైసీపీ నేత వాటిని అమ్ముకున్నాడని ఆరోపణలు వచ్చాయి. చివరికి సిమెంటు లేక సచివాలయ నిర్మాణం నిలిచిపోయింది. ఇది జరిగి ఐదేళ్లవుతున్నా అధికారులెవ్వరూ ఆ వైసీపీ నేత నుంచి నష్టాన్ని రికవరీ చేయలేకపోయారు..

గురజాల మండలం గంగవరంలో 2019 సంవత్సరంలో సచివాలయం మంజూరైంది. దీని నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు కూడా మంజూరయ్యాయి. మండలం మొత్తంమీద 14 నూతన సచివాలయాలు మంజూరు కాగా అందులో గంగవరం ఒకటి. అన్ని గ్రామాల మాదిరిగానే గంగవరంకు కూడా సచివాలయం నిర్మాణానికి 400 సిమెంట్ బస్తాలు వచ్చాయి. గంగవరం మినహా మిగతా గ్రామాల్లో సచివాలయ నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే గంగవరంలో మాత్రం నిర్మాణ పనులు ప్రారంభమే కాలేదు. సచివాలయ నిర్మాణానికి వచ్చిన 400 సిమెంట్ కట్టలను వైసీపీ నేత అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఐదేళ్లవుతున్నా వాటిని అధికారులు ఇంత వరకు రికవరీ చేయలేదు.

రికవరీ చేస్తున్నాం : పంచాయతీ రాజ్ ఏఈఈ సుధా రాజేశ్వరి

సచివాలయ నిర్మాణానికి వచ్చిన సిమెంట్ కట్టలను అమ్ముకున్న వారి వద్ద నుంచి కొంత మేర రికవరీ చేశాం. మొత్తం త్వరలోనే రికవరీ చేస్తాం.

బాలలదే భవిష్యత్తు

● బాలల దినోత్సవంలో వక్తలు
● నెహ్రూ జయంతి సందర్భంగా ఘన నివాళులు

అచ్చంపేట, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : సమాజ భవిష్యత్‌ను మార్చేది బాలలేనని అచ్చంపేట సీఐ వెంకటప్రసాదు అన్నారు. గురువారం అచ్చంపేటలోని బ్లూబెల్ హైస్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నిర్మలజ్యోతి, హెచ్‌ఎం శ్రీలత పాల్గొన్నారు.

రెంటచింతల (ఆంధ్రజ్యోతి): పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం కోటేశ్వరమ్మ ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కూలు ఆవరణలోని నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు.

రాజుపాలెం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తపాలెం గ్రామంలో ప్రతిభ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వారు విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునశర్మ, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నాగమల్లేశ్వరి హెచ్‌ఎం నరసింహారావు పాల్గొన్నారు.


దుర్గిలో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కారంపూడి,(ఆంధ్రజ్యోతి): మండలంలోనిపేటసన్నిగండ్ల ఎంపీపీస్కూల్లో ఎంపీటీసీ గాడిపత్రి రమాదేవి పూర్ణయ్య ఆధ్వర్యాన బాలలదినోత్సవంనిర్వహించారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఆపార్టీ నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి జ్ఞానరాజ్‌పాల్, మాదంశెట్టి వేదాద్రి, షేక్ చాంద్‌బాషా, కొత్త లక్ష్మయ్య, సిద్దెల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ(ఆంధ్రజ్యోతి):మండలంలోని నార్నెపాడులో జీఎంఆర్ మెమోరియల్ పబ్లిక్‌స్కూలు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ జీ.శివ కుమార్‌రెడ్డి నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుస్సేన్, మస్తానమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఊటుకూరు హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి పాల్గొన్నారు.

బెల్లంకొండ,(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీహైస్కూలు, వివిధ ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయాకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోకాళ్ల లోతు నీళ్లలో శ్మశానానికి మృతదేహాన్ని తీసుకెళ్తున్న కరాలపాడు గ్రామస్థులు



శ్మశానానికి దారేదీ ?

పిడుగురాళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరాలపాడు గ్రామంలో శ్మశానవాటికకు సరైన దారి లేక గ్రామస్థులు అవస్థ పడుతున్నారు. గురువారం గ్రామంలోని ఓ వ్యక్తి మృతి చెందగా పొలాల మధ్యన, మోకాళ్లోతు నీటిలో మృతదేహాన్ని శ్మశాన వాటిక వద్దకు మోసు కెళ్లాల్సి వచ్చింది. గ్రామంలోని అన్ని శ్మశానాలకు దారి కాగా, ఆ దారిలో నీరు ఎప్పుడూ నీరు పారుతుండడంతో అవస్థ తప్పటం లేదు. శ్మశానాలకు దారి కావాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా స్పందించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తెనపల్లి బ్రాంచ్ వారు ది.05-09-2024న ప్రచురించిన కొమ్మినేని నరసింహాస్వామి గారి యాడ్‌లో పొరపాటును లోన్ తీసుకొనే వారి పేరు కొమ్మినేని నరసింహాస్వామి అని తప్పుగా పడినది. దీనిని కొమ్మినేని శివపార్వతి అని చదువ కొనగలరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, బృందావన్ నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848062914.

నటశేఖరుడు

నటనకే నవ భాష్యం చెప్పిన

సినీ రంగంలో వినూత్న పోకడలకు శ్రీకారం చుట్టి, సాహసోపేత సినిమాల నిర్మాణంతో నటనకే కొత్త భాష్యం చెప్పిన నటశేఖరునికి ఆంధ్రా జేమ్స్‌బాండ్‌గా, గూఢచారిగా, దేశభక్తి నిండిన గొప్ప మనీషిగా అన్నిటిమించి సూపర్ స్టార్‌గా అభిమానుల గుండెల్లో నిలిచిపోయారు. భువినుంచి నింగికేగి రెండేళ్లవుతున్నా అభిమానుల గుండెల్లో మాత్రం ఆయన పదిలంగానే ఉన్నారు. నేడు ఆయన రెండవ వర్ధంతి. రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు ఆయన వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమవుతుంటే, ఇటు తెనాలి, ఆయన స్వగ్రామం బుర్రిపాలెంలోనూ పలు కార్యక్రమాలను జరిపేందుకు, ఆయన స్మరణతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. ఏ రంగంలోనూ గుర్తింపు లేని తన స్వగ్రామానికి ఆయనే ఒక ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చారు. ఎంత ఎత్తు ఎదిగినా సొంత ఊరుని, కన్నవారిని మరువకూడదన్న నానుడిని నిజం చేశారు కృష్ణ. తాను సంపాదించిన దానిలో కొంత స్వగ్రామానికి కూడా ఖర్చు చేయడం ఇక్కడివారి ప్రేమాభిమానాలను పదిలపరిచింది.



నేడు సూపర్ స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి

బుర్రిపాలెంలో కృష్ణ జ్ఞాపకాలు పదిలం

ఆయన వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు

తెనాలి, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ కృష్ణగా సుపరిచితులైన ఆయన అసలు పేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. ఘట్టమనేని వీరరాఘవయ్య చౌదరి, నాగరత్నమ్మ దంపతులకు 1943, మే 31న ఆయన జన్మించారు. ఈ దంపతులకు మొత్తం ఐదుగురు సంతానం. వారిలో కృష్ణ పెద్ద కుమారుడు. హనుమంతరావు, ఆదిశేషగిరిరావు, లక్ష్మి, అలివేలు మంగమ్మలు ఆయన సోదర సోదరీమణులు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన పాఠశాల విద్యను తెనాలిలోని తాలూకా హైస్కూల్‌లో అభ్యసించారు. ఉన్నత చదువులు గుంటూరు, ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాలలో పూర్తిచేశారు. సీఆర్‌రెడ్డి కళాశాలలో అక్కినేనికి జరిగిన సన్మానం, ఆదరణ చూసిన కృష్ణకు హీరో కావాలనే కోరిక కలగడం, తండ్రిని ఒప్పించి సినిమాల్లోకి వెళ్లడం జరిగిపోయాయి. అదే సమయంలో స్వగ్రామానికి దగ్గర్లోని కంచర్లపాలెం గ్రామానికి చెందిన కృష్ణ మేనమామ కుమార్తె ఇందిరాదేవిని వివాహం చేసుకున్నారు. దీంతో ఈ రెండు గ్రామాలతో ఆయనకు అవినాభావ సంబంధం ఏర్పడింది. ఆయనకు ఐదుగురు సంతానం. రమేష్‌బాబు, మహేష్‌బాబు ఇద్దరు మగపిల్లలయితే, పద్మజ, మంజుల, ప్రియదర్శిని ఆడపిల్లలు. అయితే కృష్ణ సినిమాల్లోకి వెళ్లాక తనతో సాక్షి సినిమాలో కలసి నటించిన విజయనిర్మలతో పరిచయం ఏర్పడి, 1969లోనే ఆమెను రెండో వివాహం చేసుకున్నారు.

బుర్రిపాలెం బుల్లోడుగా గుర్తింపు

నా జీవన బృందావనిలో అమని ఉదయంలో అంటూ బుర్రిపాలెం నుంచి మొదలైన సూపర్ స్టార్ కృష్ణ సినీ ప్రస్థానం బాలీవుడ్ వరకు సాగింది. ప్రపంచ దేశాల్లోనూ ఆయనకు అభిమానులు, అభిమాన సంఘాలున్నాయంటే తన వినూత్న పోకడలే దీనికి నిదర్శనం. 'బుర్రిపాలెం బుల్లివాడిని నేనే'నంటూ సొంత ఊరిలో చిత్రాలను తెరకెక్కించి, తనతో పాటే, పుట్టిన గడ్డకూ ఎనలేని గుర్తింపు తెచ్చిపెట్టారు. తేనెమనసులు సినిమాతో తెలుగు తెరపై హీరోగా కనిపించిన కృష్ణ తర్వాత అనేక వినూత్న చిత్రాలను నిర్మించి, నటించారు. అయితే ఎంత ఎదిగినా, తన స్వగ్రామాన్ని మర్చిపోకుండా, గ్రామంపై ప్రేమతో గ్రామీణ వాతావరణం ఎక్కువగా కనిపించే చిత్రాలలో నటించారు. తన స్వగ్రామం పేరుతో 'బుర్రిపాలెం బుల్లోడు' సినిమా కూడా తీశారు. దీనితోపాటే పీణ, ప్రజారాజ్యం పూర్తి సినిమాలు బుర్రిపాలెం చుట్టుపక్కల తీస్తే, పాడిపంటలు, రైతు భారతం, ఈనాడు, డాక్టర్ సినీ యాక్టర్ వంటి మరికొన్ని చిత్రాలు కొంత భాగం బుర్రిపాలెంలో చిత్రీకరించారు. ఆయన నటించిన గ్రామీణ వాతావరణం ఉండే ప్రతి సినిమాను తన స్వగ్రామంలో కొంతయినా షూటింగ్ జరిపించటం ఆయనకు ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమకు నిదర్శనం.

సినీ రంగం నుంచి రాజకీయం వైపునకు అడుగులు

1964 వరకు స్టేజీ ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన ఆయన ఆశలు సినీ రంగానికి నడిపించాయి. తండ్రితో తన ఆలోచన చెప్పడమే తడవుగా సినీ లోకంలోకి అడుగు పెట్టేశారు. 1964 ముందు వరకు చిన్నచిన్న పాత్రల్లో నటించిన కృష్ణకు ఆ తర్వాత వచ్చిన తేనెమనసులు సినిమా హీరోగా గుర్తింపు తెచ్చిపెట్టింది. తక్కువ సమయంలో 345కి పైగా చిత్రాలలో నటించి రికార్డు సృష్టిస్తే, తెలుగు నుంచి బాలీవుడ్ వరకు పయనం సాగించారు. సొంతగా రూపొందించిన సింహాసనం సినిమాను సింహాసన్ పేరుతో



తల్లిదండ్రులు వీరరాఘవయ్య చౌదరి, నాగరత్నమ్మతో కృష్ణ

1986లో హిందీలో తీస్తే, 2001లో 'అమ్నాని ఆరాజా ఇర్ రూపాయా' పేరుతో హిందీ చిత్రాన్ని సమర్పించారు. 1982లోనే కన్నాడు కన్న అనే మరికొన్ని ఇతర భాషా చిత్రాలనూ తెరకెక్కించారు. 2016లో చివరి శ్రీశ్రీ సినిమాతో నటనకు సెలవు చెప్పారు. అయితే 2010 తర్వాత నటనకు విరామం చెప్పినా రెండు, మూడు సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించారు. రోజుకు మూడు షిఫ్టుల్లో పని చేసి వేలాది మంది సినీ కార్మికులకు ఉపాధి కల్పించారు. 1964-1995 మధ్య కాలంలో ఏడాదికి సుమారు 10 సినిమాల చొప్పున కృష్ణ నటించారు. 1972వ సంవత్సరంలో అయితే ఏకంగా 18 చిత్రాలలో నటించారు. ఇది అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక రికార్డుగా మిగిలిపోయింది. ఆయన నటించిన 100వ చిత్రం అల్లూరి సీతారామరాజు ఒక బ్రాండ్ మార్క్‌గా నిలిచింది. ఆయన రాజకీయ రంగంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు కృష్ణ. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 1989లో ఆ పార్టీ తరఫున ఏలూరు పార్లమెంటు స్థానానికి పోటీచేసి ఎంపీగా గెలిచారు. తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టారు. అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీతో మంచి సంబంధాలుండేవి. రాజీవ్ గాంధీ మరణం, మరికొన్ని ఇతర కారణాలతో, ఆయన రాజకీయాల నుంచి తర్వాత తప్పుకున్నారు.

స్వగ్రామాన్ని దత్తత తీసుకుని...

తనకు జన్మనిచ్చిన ఊరును అభివృద్ధి పథంలో నిలపాలనే తపన, అక్కడి వారి రుణం తీర్చుకోవాలనే ఆలోచనతో తన స్వగ్రామాన్ని దత్తత తీసుకున్నారు. బుర్రిపాలెంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తన బాటలోనే తన కుమారుడు మహేష్‌బాబును కూడా నడిపించారు. తండ్రి స్ఫూర్తితోనే మహేష్‌బాబు ప్రస్తుతం బుర్రిపాలెం గ్రామాన్ని, తల్లి స్వగ్రామం కంచర్లపాలెంను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. గ్రామస్థులకు వైద్యసేవలు మాత్రం ప్రతినెలా అందించేందుకు కృషి చేస్తున్నారు. బస్ షెల్టర్‌లు, కమ్యూనిటీ భవనాలు, జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లి నాగరత్నమ్మ జ్ఞాపకార్థం అదనపు గదుల సముదాయాన్ని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఆ వసరమైన కంప్యూటర్‌ల వంటివాటిని సమకూర్చారు. మహేష్‌బాబు షూటింగ్ హడావిడిలో ఉన్నా, ఆయన సతీమణి నమ్రత, సోదరి పద్మజలు మాత్రం వచ్చి అన్ని ఏర్పాట్లు పరిశీలించి వెళుతుంటారు. అయితే కృష్ణ వర్ధంతి సందర్భంగా గ్రామస్తులు, అభిమాన సంఘాలు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.



2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ నుంచి పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణ



అప్పటి భారత ప్రధాని రాజీవ్‌గాంధీతో..



చంద్రబాబుతో కృష్ణ, విజయనిర్మల దంపతులు



కుటుంబసభ్యులతో కృష్ణ



బుర్రిపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ ఇల్లు

సీజీహెచ్‌ఎస్‌కు నేడు సెలవు

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గురునానక్ జయంతి సందర్భంగా కేంద్రప్రభుత్వం శుక్రవారం సెలవు దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచితంగా సేవలందించే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) కార్యాలయం సేవలు ఉండవని గుంటూరు సీజీహెచ్‌ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని సీజీహెచ్‌ఎస్ కార్డు లబ్ధిదారులు వైద్య సేవల నిమిత్తం శుక్రవారం గుంటూరుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

పలు కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

గుంటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను నియమించింది. ఉమ్మడి గుంటూరుకు చెందిన పలువురు స్థానం సంపాదించుకున్నారు. వాల్మీకి/బోయ కార్పొరేషన్లో గురజాల నియోజకవర్గం నుంచి టీడీపీ నేత ముప్పన్న వెంకటేశ్వర్లు, మాదిగ కార్పొరేషన్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి జనసేన నేత బేతపూడి విజయశేఖర్, తాడికొండ నియోజకవర్గం నుంచి అమరావతి ఉద్యమ నేత, టీడీపీ నాయకురాలు కంభంపాటి శిరీష, మాచర్ల నియోజకవర్గం నుంచి టీడీపీ నేత సాతులూరి కుమార్‌లు సభ్యులుగా నియమితులయ్యారు.

దేశం కోసమే నెహ్రూ కుటుంబం బతికింది

● ముగ్గురు మాజీ ప్రధానుల విగ్రహాల ఆవిష్కరణ సభలో షర్మిల

పెదకాకాని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశం కోసమే నెహ్రూ కుటుంబ బతికిందని, ఆ కుటుంబ దేశం కోసం ఎంతో త్యాగం చేసిందని కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం పెదకాకానిలో దివంగత



ప్రసంగిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో షర్మిల మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రేమ, ఐక్యత కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను నెరవేర్చలేదని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ పార్టీలుగా వ్యవహరిస్తున్నాయన్నారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. బాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరు బీజేపీకి ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని ఆమె ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికలను అమలు చేసి దేశ అభివృద్ధి కోసం నెహ్రూ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలు ఇప్పుడు ఫలాలు ఇస్తున్నాయన్నారు. ప్రాజెక్టులు, ఐఐటీ, ఎన్ఐటీ, ఇస్రో వంటి ఎన్నో స్థాపించారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తల్లి లాంటిది అన్నారు. ఆ పార్టీ దేశానికి ఎంతో మేలు చేసిందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ షర్మిల ప్రాణాలకు ముప్పు ఉందని, కుటుంబాన్ని, మీ ప్రాణాలను నువ్వే కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిలకా విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కి

- చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో 50 ఏళ్లు రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడి పోయిందని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అసెంబ్లీలో అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌పై ధన్యవాదాలు చెబుతూ గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లడుతూ రూ. 10లక్షల 50వేల కోట్లు అప్పులు, పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోయేల చేయడం, ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను వంచించడం, గుంతల రోడ్లు, దోపిడీ, హత్య రాజకీయాలు మినహా వైసీపీ రాష్ట్రానికి చేసింది ఏమీలేదని తెలిపారు. వైసీపీ అన్ని విధాలుగా ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని తిరిగి పునర్నిర్మించేందుకు మంచి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారని చెప్పారు. ఆర్థిక నేరస్తులు, హంతకులు, దోపిడీదారులకు పదవులు, ప్రమోషన్లు జగన్ కల్పించారని దుయ్యబట్టారు. అలాంటి అరాచకాలను మళ్లీ చూడకూడదనే ప్రజలు సీఎంగా చంద్రబాబు నాయుడును గెలిపించారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా చేయడానికి విజన్ 2047



వైసీపీ పాలనలో పాడైయిన రోడ్ల ఫొటోలను బడ్జెట్ సమావేశాల్లో చూపిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

తీసుకున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో ఏ రోడ్డు చూసిన గుంతలమయం తప్ప ఏం సాధించారని, ఎకడైనా ఒక కొత్త రోడ్డు కాని, రోడ్డు మరమ్మతులు గాని చేయించారా అని ప్రశ్నించారు. రోడ్లపై గుంతలు పూడ్చటానికి రూ.600 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారని వివరించారు. అవసరమైతే మరో రూ.300 కోట్లు ఇస్తారని చెప్పారు. చెత్తమీద పన్ను వేసిన ఏకైక చెత్త ప్రభుత్వం వైసీపీ అన్నారు. ఉద్యోగాలని చెప్పి వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి యువతను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం 20లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఎవరైనా పరిశ్రమలు పెడతామంటే వారికి కావాల్సిన భూకేటాయింపులు మొదలు విద్యుత్ మిగతా అనుమతులన్నీ వేగంగా ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం సొంత బాబాయిని హత్య చేస్తే హంతకులకు ఎంపీ సీటు ఇచ్చి ప్రమోషన్ ఇచ్చారని ఎద్దేవ చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి ఇంటిపైకి దాడులకు వెళ్లిన వారికి పదవులు ఇచ్చి మంత్రులు చేస్తారా అని ప్రశ్నించారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రాజుపాలెం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కళాశాల భవనంపై నుంచి దూకి నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి రాజుపాలెం మండలంలోని కోటనెమలిపురి గ్రామ శివారు కొండమోడు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండమోడు గ్రామ సమీపంలోని అంజిరెడ్డి నర్సింగ్ కళాశాలలో కేరళ రాష్ట్రానికి చెందిన విస్మయ అనే విద్యార్థిని బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం రాత్రి విస్మయ తను చదువున్న కళాశాల బిల్డింగ్ పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాలతోవున్న విద్యార్థినిని కళాశాల సిబ్బంది నరసరావు పేటలోని అంజిరెడ్డి హాస్పిటల్‌కి తరలించారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నాసిరకం ల్యాప్‌టాప్‌ల పంపిణీపై 90 రోజుల్లో దర్యాప్తు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

శాసనమండలిలో మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐఐఐటీ విద్యార్థులకు నాసిరకం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారని, దీనిపై 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలోని ఐఐఐటీ విద్యార్థులకు 2023లో నాసిరకం ల్యాప్‌టాప్‌లు అందించడంపై మండలిలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, కంచర్ల శ్రీకాంత్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆర్జీయూకేటీ(ఐఐఐటీ)ల్లో అభ్యసించే విద్యార్థులకు అందించేందుకు 2023లో 6,500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారన్నారు. ఒక్కో ల్యాప్‌టాప్ కోసం రూ.27 వేలు వెచ్చించారని తెలిపారు. అయితే 1,520 ల్యాప్‌టాప్‌ల్లో సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ల్యాప్‌టాప్‌ల్లో కనీసం ఒరిజినల్ ఆపరేటింగ్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ కూడా ఇన్‌స్టాల్ చేయలేదని, బేసిక్ అడాప్టర్‌లు కూడా పనిచేయని పరిస్థితి ఉందన్నారు. కొన్ని ల్యాప్‌టాప్‌ల్లో ఆడియో క్వాలిటీలో ఇబ్బందులు ఉన్నాయని, బ్యాటరీలు కూడా నాసిరకంగా ఉన్నాయని సభకు మంత్రి లోకేశ్ వివరించారు. 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి ఆ వివరాలను తప్పనిసరిగా సభ ముందు పెడతాం' అని స్పష్టం చేశారు.

26న జరిగే ఆందోళనల్లో...

ప్రజలు భాగస్వాములు కావాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

గుంటూరు(తూర్పు), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈ నెల 26న జరిగే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో కార్మిక, రైతు, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఏ ఐ టీ యూ సీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతురావు, సీఐటీ యూ జిల్లా నాయకుడు కే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లా డుతూ 26న ఉదయం 10 గంటలకు స్థానిక శంకర్‌విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకు మండల, గ్రామ స్థాయిలో ప్రచార కార్యక్ర మాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26న రాజ్యాంగా ఆమోద దినోత్సవం పురస్కరించుకుని ఈ ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు పదిసార్లు క్యాబి నెట్ సమావేశం జరిగిందని, ఒక్కసారి కూడా రైతులు, కార్మికుల సమస్యలపై చర్చించలేదని విమర్శించారు.సమా వేశంలో వామపక్ష నాయకులు జంగాల అజయ్‌కుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, దండా లక్ష్మీనారాయణ, కంచుమాటి అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి, పాటిబండ్ల కోటేశ్వరరావు, కొరపాటి కోటయ్య ప్రసంగించారు.



మాట్లాడుతున్న ఓబులేసు, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

కష్టమర్లకు మరిన్ని సేవలు

యూనియన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవంలో కలెక్టర్

గుంటూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లో లీడ్ బ్యాంకుగా ఉన్న యూనియన్ బ్యాంకు ద్వారా కష్టమర్లకు మంచి సర్వీసు అందుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. యూనియన్ బ్యాంకు 106వ వ్యవస్థాపక దినోత్సవం పెదపలకలూరు రోడ్డులోని వీ కన్వెన్షన్‌లో గురువారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన



యూనియన్ వ్యవస్థాపక దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చినట్లు చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తుందని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ జవహర్, డిప్యూటీ రీజనల్ హెడ్ రాజేష్, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మాజీ చైర్మన్ బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేయర్ మనోహర్‌ను అరెస్టు చేయాలి

గతంలో చేసిన వ్యాఖ్యలపై డీఎస్పీకి ఆధారాల అందజేత

పోలీసుల లాఠీతో దాడి.. పవన్‌కల్యాణ్‌ను దూషించారన్న టీడీపీ నేతలు

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గతంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ నేతలు బంద్ పాటిస్తుండగా పోలీసుల చేతిలోని లాఠీని లాక్కొని టీడీపీ శ్రేణులపై దాడి చేయడమే కాక చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లను అసభ్య పదజాలంతో దూషించిన గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడిపై చర్యలు తీసుకోవాలని గురువారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక



వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు, యల్లావుల అశోక్, అడకా శ్రీను, రమణ, వేములకొండ శ్రీనివాస్ తదితరులు

కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్‌ను కలసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పట్లోనే అరండల్‌పేట పోలీసు స్టేషన్లో టీడీపీ, జనసేన నాయకులు ఫిర్యాదు చేసినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని డీఎస్పీకి వివరించారు. ఆ రోజు మనోహర్ చేసిన వ్యాఖ్యలను డీఎస్పీకి వినిపించి, వీడియోని కూడా అందజేశారు. ప్రభుత్వం మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుటుంబసభ్యులను దూషించిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో మేయర్ మనోహర్‌పై కూడా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు అనంతరం కనపర్తి, కార్పొరేటర్లు యల్లావుల అశోక్, రమణ, అడకా శ్రీనివాసరావు, వేములకొండ శ్రీనివాసరావులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని నగర ప్రథమ పౌరుడినన్న స్పృహ కూడా లేకుండా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సహా కుటుంబసభ్యులను అసభ్యంగా దూషించిన మనోహర్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో మేయర్ రెచ్చిపోయి అచ్చెన్నాయుడు, పట్టాభిలను కూడా నోటికొచ్చినట్లు దూషించారన్నారు. ఆయనపై త్వరలో మరో ఫిర్యాదు కూడా చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయించిన నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లి దర్జాగా బయట తిరుగుతుంటే దాడి చేసిన వారు కటకటాల్లో రోజులు లెక్కబెడుతున్నారన్న విషయాన్ని ఆ పార్టీ కార్యకర్తలు గుర్తించాలన్నారు. జగన్‌రెడ్డి, సజ్జలరెడ్డి, సాయిరెడ్డి మాటలు నమ్మి సామాజిక మాధ్యమాల్లో మహిళలపై అసభ్య పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలు, వ్యక్తిత్వ హననంకు పాల్పడితే ప్రభుత్వ పరంగా జైలుకు రాకుండా కఠిన చర్యలు ఉంటాయన్నారు. టీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో వైసీపీ నేతల చేతుల్లో వేధింపులకు, హత్యలకు గురైంది ఎక్కువగా బడుగు, బలహీనవర్గాలకు చెందినవారేనన్నారు. గత ప్రభుత్వంలో బడుగులపై వైసీపీ నేతలు చేసిన అరాచకాలపై ప్రభుత్వం సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు.

పల్నాడు వార్తలు

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

మద్యం సీసాలు స్వాధీనం

వినుకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రగడ్డపాడు, కొత్తపాలెం గ్రామాల్లో గురువారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా చాట్రగడ్డపాడులో నక్క గురవారెడ్డి వద్ద 10 లిక్కర్ బాటిల్స్, కొత్తపాలెంలో ఒక మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 9 కింగ్‌ఫిషర్ బీర్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిని కోర్టుకు హాజరపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ విసీల, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు శాసనసభకు హాజరుకాకపోడం సమంజసమేనా?

● కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైసీపీకి చెందిన శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడం ఎంతవరకు సమంజసం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవి లేదా ప్రతిపక్ష హోదా ఉంటేనే వస్తానన్న వ్యక్తికి రాజకీయాలలో కొనసాగే అర్హత లేదన్నారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలు వినిపించకపోతే ప్రజలే మీకు సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. 40 శాతం ఓట్లు వచ్చాయి కాబట్టి తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని జగన్‌మోహన్‌రెడ్డి అడగటం అతని రాజకీయ అజ్ఞానికి నిదర్శనం అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడడానికి కావలసింది చిత్తశుద్ధి కాని, ప్రతిపక్ష హోదా కాదన్నారు. 11 మంది శాసనసభ్యులున్నా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా, శాసన మండలికి సభ్యులను పంపించడంతో వైసీపీ డొల్లతనం కనబడుతోందన్నారు.

23న మండల పరిషత్ సమావేశం

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షుడు దేవినేని శంకరరావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో కే శ్రీనివాసరావు గురువారం తెలిపారు. సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ధనలక్ష్మీ కళాశాల విద్యార్థిని ఎంపిక



సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన శాంతకుమారి

ఈపూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు మండలంలోని ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థిని కే శాంత కుమారి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు చెప్పారు. ఈ నెల 12, 13 తేదీలలో నర్సరావుపేట కృష్ణవేణి కళాశాలలో జరిగిన అంతర కళాశాలల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన శాంతకుమారి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యిందన్నారు. నవంబరు 29వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని కరైకుడి అలగప్పా యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు బలరాం నాయక్, అరవింద్, వంశీ, దానులు అభినందించారు.

విద్యార్థులకు దాతల వితరణ

రొంపిచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి జడ్పీ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా పలువురు దాతలు నగదు సాయం అందజేశారు. కోమటినేని నాసరయ్య రూ.30వేలు గత సంవత్సరం 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థికి దామచర్ల శ్రీనివాసరావు రూ.10,116లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

రొంపిచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనర్ నరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెట్రోల్, డీసిల్ రేట్లు పెంచారని తెలిపారు. రొంపిచర్లలో సబ్ స్టేషన్ వద్ద ఉన్న హైవేపై ప్రమాదాలు జరిగి పలువురు మరణించారని తెలిపారు. ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కామినేని రామారావు, అంగలూరి ఫణీంద్ర, అంజిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సాయం

నర్సరావుపేట లీగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో హోంగార్డు శరత్‌బాబు మరణించగా వారి కుటుంబానికి సహచర హోంగార్డులు అండగా నిలిచి తమ ఒకరోజు వేతనాన్ని అందజేశారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు చేతులమీదుగా శరత్‌బాబు భార్య జాస్మికి గురువారం ఎస్పీ కార్యాలయంలో రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ ఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

నరసరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక ప్రజా ప్రజాప్రతినిధులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణకుమారి, జడ్పీటీసీ చిట్టిబాబు, ఈవోపీఆర్డీ నాగానంద్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా చిరుమామిళ్ళ - సంక్రాంతిపాడు రహదారి



చిరుమామిళ్ళ - సంక్రాంతిపాడు రహదారిలోని గోతులు

నాదెండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల మండలంలోని చిరుమామిళ్ళ - సంక్రాంతిపాడు గ్రామాల మధ్య ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. గడిచిన ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారులకు కనీస మరమ్మతులు చేపట్టకపోవటంతో రహదారి మొత్తం పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు నానా ఇబ్బందులు నానా ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలు ఆ గుంతల్లో పడి పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు ఈ రహదారి దుస్థితిపై చర్యలు తీసుకోవాలని, పంచాయతీరాజ్ శాఖ అధికారులు గుంతలకు కనీస మరమ్మతులు నిర్వహించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

చరిత్ర తెలిసేది గ్రంథాలయాలతోనే

గ్రంథాలయ వారోత్సవాల్లో కమిషనర్ జస్వంత్‌రావు



సభలో ప్రసంగిస్తున్న మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు

నరసరావుపేట కల్చరల్, నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చరిత్ర తెలిసేది గ్రంథాలయాలతోనేనని నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ యం.జస్వంతరావు అన్నారు. గురువారం పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో జరిగిన 57వ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాణ గ్రంథాలు, చారిత్ర గ్రంథాలు లభ్యమయ్యే చోటు గ్రంథాలయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి యడ్లపాటి రాధ, అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి, పద్యకవి ఈపూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయల్లో వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారులు సుబ్బారావు, వెంకటరావు గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఈపూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మండలంలోని ఈపూరు శాఖా గ్రంథాలయం, ముప్పాళ్ళలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు గంటా శ్రీనివాసరావు, ఎస్ నాగలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

● వినుకొండ: స్థానిక గ్రంథాలయంలో గురువారం జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మున్సిపల్ కమిషనర్ ఎస్‌ఎస్ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈఓ జాన్‌సుందరరావు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారాం, రిటైర్డు హెచ్ఎం రవికుమార్, ఇంచార్జ్ గ్రంథాలయాధికారి భుక్యా బద్రీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: మండలంలోని జగ్గాపురం, యడ్లపాడులో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ముందుగా బాలలదినోత్సవం జరిపారు. కార్యక్రమంలో గ్రంథాలయఅధికారి అంజమ్మ, గ్రామపెద్దలు పోపూరి గంగయ్య చౌదరి, మానుకొండ రామారావు, కల్లూరి సాంబ్రాజ్యం, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వార్డు కౌన్సిలర్ కొత్త కుమారి వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయ ఇన్చార్జ్ అధికారి ఎం నాగుల్ మీరావలి, డాక్టర్ పి వి సుబ్బారావు, దాసరి చిట్టిబాబు, ఎం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



గీతాంజలి రెసిడెన్షియల్‌లో వివిధ వేషధారణలో ఉన్న బాలికలు

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు విద్యాసంస్థలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ స్కూల్ వారి విట్ క్యాంపస్ లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ముఖ్య అతిథులుగా స్కూలు డైరెక్టర్ దండా పవన్ కుమార్, రేజాశ్రీ పాల్గొన్నారు. సెయింట్ చార్లెస్ స్కూలులో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ విమల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు బ్రహ్మం చాచా నెహ్రూ వేషధారణ ఆకట్టుకుంది. వేద స్కూలులో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మద్రి చెన్నారెడ్డి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జ్ హెచ్ఎం పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూలులో డైరెక్టర్ సి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో, పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో కూడా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

● వినుకొండ: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న బాలల దినోత్సవం పలు పాఠశాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ జాతీయ నాయకులు వేషధారణలు, భారతమాత వేషధారణ దేశంలోని రాష్ట్రాల సంప్రదాయ అలంకరణలు పలువురిని ఆకట్టుకున్నాయి. పట్టణంలోని గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్, గీతాంజలీలీడ్ స్కూల్, గీతాంజలీ స్కూల్స్‌లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీవివేకనంద హై స్కూల్‌లో చిల్డ్రన్స్ వేడుకలు స్కూల్ డైరెక్టర్ సయ్యద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లయోలా ఇంగ్లీష్ మీడియంలో చిల్డ్రన్స్ డే ఘనంగా నిర్వహించారు.

● యడ్లపాడు: కొండవీడు ఎంపీయూపీ పాఠశాల, మైదవోలు ఎంపీపీ పాఠశాల, యడ్లపాడు నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్లలోని శంకరభారతి పురం హైస్కూలులో జరిగిన బాలల దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులు ఎం.పార్వతి, ఐసీడీఎస్ సీడీపీవో మాణిక్యాలరావు, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు బోడె కృష్ణారెడ్డి, ప్రశాంత్‌కుమార్, కందుల శైలజ, డీఈవో సీహెచ్ నానమ్మ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులు ఎ.గురులింగం, ఉపాధ్యాయులు కె. సుధాకర్, ఎస్వీ సుబ్రమణ్యం, ఎం. అవర్ల, ఫాతిమా, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్‌కే ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. ఉప్పలపాడులో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యన్నం నర్సారెడ్డి, గ్రంథ పాలకులు పెదపోతురాజు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రామిరెడ్డి పేటలోని ఆనంద నిలయం బాలికల వసతి గృహంలో గురువారం బాలల దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రధాన జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఆశీర్వాదం పాల్ పాల్గొని ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాల గురించి వివరించారు. రోజువారీ జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పీఎల్వీలు, వసతిగృహం వార్డెన్ కే జయలక్ష్మి, మొదటి పట్టణ ఎస్ఐ అరుణ, పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత, ఐటీ మంత్రి లోకేశ్‌లపై, వారి కుటుంబ సభ్యులపై గతంలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త, వైసీపీ నాయకురాలు శ్రీరెడ్డిపై చిలకలూరిపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం టీడీపీ మహిళా నాయకులు ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు, అసభ్య పదజాలంతో కూడిన క్లిప్పింగ్‌లు ఫిర్యాదుకు జత చేశారు. వీటి ఆధారంగా శ్రీరెడ్డిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వారు కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి షేక్ జెరీనా సుల్తానా, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అమరా రమాదేవి, ప్రధాన కార్యదర్శి పోపూరి లక్ష్మి, వీరకుమారిలు ఈ ఫిర్యాదులు చేశారు.

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు ఎమ్మెల్యే అభినందనలు




నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతిగా నియమితులైన ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మధుమేహ దినోత్సవం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పీ భార్గవ భూషణరావు మధుమేహానికి కారణాలు, నివారణ, చికిత్స పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఎం రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ ఆట్లూరి కాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనమర్లపూడికి చెందిన విద్యార్థి అదృశ్యం



భరత్

కనమర్లపూడి (శావల్యాపురం) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుతున్న బాలుడు పాఠశాల బయటకు వచ్చి కనిపించకుండాపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామానికి చెందిన పూరేటి వెంకటేశ్వర్లు కుమారుడు భరత్ వినుకొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం సమయంలో పాఠశాల నుంచి బయటకు వచ్చిన భరత్ అదృశ్యమయ్యాడు. భరత్ ఆచూకీ తెలిసినవారు వినుకొండ పోలీసులకు సమాచారం అందించాలని, వినుకొండ పోలీస్‌స్టేషన్ 08646-272333, 9440796248, 8523877893 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

మండలాన్ని ప్రథమస్థానంలో నిలపాలి: ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి సమన్వయంతో పనిచేసి శావల్యాపురం మండలాన్ని అభివృద్ధిపథంలో తీర్చిదిద్ది జిల్లాలో ప్రథమస్థానంలో నిలపాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖవారి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై మండలపరిషత్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుగుణ, సీడీపీవో అనూరాధ, ఏపీఎం వాసుబాబు, ఏపీవో రామారావు, పశువైద్యాధికారి గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డిప్యూటీ డీఎంహెచ్‌వో

శావల్యాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను వెంటనే గుర్తించి సకాలంలో వారికి మంచి వైద్యసేవలు అందించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి అన్నారు. ఎన్‌సీడీ సర్వే 3.0 ప్రారంభమైన సందర్భంగా మండలంలోని కనమర్లపూడి గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేని డిప్యూటీ డీఎంహెచ్‌వో గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను కలసి వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు.

పాఠశాల బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఇద్దరికి గాయాలు

నాదెండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు - కర్నూలు రహదారిపై సాతులూరు గ్రామ సమీపంలో పాఠశాల విద్యార్థులతో ప్రయాణిస్తున్న బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఒక విద్యార్థిని గాయపడింది. నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ పాఠశాలకు ప్రతి రోజు సాతులూరు, పొనుగుపాడు గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్తుంటారు. పొనుగుపాడు వెళ్తుండగా రైస్ మిల్లు వద్ద గుంటూరు వైపు నుంచి నరసరావుపేట వైపు వచ్చే ఆర్టీసీ బస్సు పాఠశాల బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయ పడ్డ వారిని ప్రైవేట్ వాహనాల్లో చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించారు.

గురుకుల పాఠశాలల విద్యార్థినుల ఆటల పోటీలు ప్రారంభం



గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న శివశక్తి అంజన్ ఫౌండేషన్ చైర్మన్ జీవీ లీలావతి

నూజెండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జోనల్ లెవల్ బాలికల జోన్-3 ఆటల పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివ శక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ జీవీ లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ జాయింట్ సెక్రటరీ ఏ మురళీకృష్ణలు క్రీడాకారుల గౌరవ వందన స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు అథ్లెటిక్స్‌లో మూడు జిల్లాలకు చెందిన 30 గురుకుల పాఠశాలల్లోని 1200 మంది క్రీడాకారిణిలతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గెలుపొందిన విద్యార్థినిలకు జీవి లీలావతి బహుమతులు అందజేసి అభినందించారు.

మైనారిటీ బాలికల వసతి గృహం, ఐటీఐ కళాశాలను ప్రారంభించాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ములకలూరు వద్ద మైనారిటీ బాలికల వసతి గృహానికి మౌలిక వసతులు కల్పించి, సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని మైనారిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలో మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములకలూరులో నిర్మాణం పూర్తయి గత ఐదు సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఐటీఐ కాలేజీలో సిబ్బందిని నియమించి వచ్చే విద్యా సంవత్సరంలో తరగతలు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, షేక్ మాబు, ఖాసీమ్ పీరా, కరీముల్లా, సుభాని, రహమత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయాల్లో సహకార వారోత్సవాలు

శావల్యాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను మండలంలోని కారుమంచి, శావల్యాపురం సొసైటీ కార్యాలయాల్లో గురువారం ఘనంగా ప్రారంభించారు. విజయవాడ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ రామ్మోహన్‌రావు, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి న్నరా సురేంద్రబాబు, సీఈవోలు జాలాది నాగప్రసాద్, యేరువ వెంకటనారాయణ, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొని సొసైటీకార్యాలయాల వద్ద సహకార జండాను ఎగురవేసి జండా వందనం చేశారు.

రాయితీపై మేత కటింగ్ యంత్రం

రొంపిచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయితీపై మేత కటింగ్ యంత్రాన్ని పాడిరైతులకు అందజేయనున్నట్లు కర్లకుంట పశువైద్యులు సాయి మహేష్‌రెడ్డి గురువారం తెలిపారు. రైతులు రూ.20,382 చెల్లిస్తే మిగిలిన రూ.13,588ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆధార్, బ్యాంక్ పాసుబుక్ జిరాక్స్‌తో పశు వైద్యశాలలకు రావాలన్నారు.

అందుబాటులో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు

● రొంపిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి





రొంపిచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారి పోతిరెడ్డి జగన్‌నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతికి ఆయన వెల్లడించిన వివరాలు.

ప్రశ్న: పీహెచ్‌సీలో ఏ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి?

జవాబు: రొంపిచర్ల పీహెచ్‌సీలో టైఫాయిడ్, డెంగీ, మలేరియా, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన వారు పీహెచ్‌సీలో సంప్రదించవచ్చన్నారు.

ప్ర: జ్వర పీడితుల కోసం క్యాంపులు నిర్వహిస్తున్నారా?

జ: ఇంటింట సర్వే జరుగుతూ ఉంది. టీకాల సర్వేను నిర్వహిస్తున్నాం.

ప్ర: విద్యార్థుల కోసం వైద్య పరీక్షలు చేపడుతున్నారా?

జ: ఆర్‌బీఎస్‌కే కింద విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 44రకాల వివరాలతో కూడిన పత్రాల్లో పొందుపరుస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ప్ర: గర్భిణులకు ఎటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు?

జ: గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఐరన్ తక్కువగా ఉన్న వారికి ఇంజక్షన్లను ఇస్తున్నాం. ఈ ఇంజక్షన్‌లు వారికి ఎంతగానో దోహదపడతాయి.

ప్ర: జంతువులు కరిచిన వారికి వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయా?

జ: కుక్క, ఎలుక, కోతి వంటి జంతువులు కరచిన వారికి వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వారు పీహెచ్‌సీలో సంప్రదించవచ్చు.

దేశ నిర్మాణంలో సహకార సంఘాలదే కీలక పాత్ర

● సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ రాంమోహన్‌రావు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు భారత నిర్మాణంలో సహకార సంఘాలు కీలకపాత్ర వహించనున్నాయని విజయవాడ సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ యం.రాంమోహనరావు అన్నారు. గురువారం స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని డివిజనల్ సహకార అధికారి కార్యాలయంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా సహకార తనిఖీ అధికారి డి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్స్ జె.పి. టాండన్, షేక్ రహంతుల్లా, స్వర్ణ రామిరెడ్డి, కే. అంజమ్మ, లక్ష్మీ బాయి, మహేష్, సురేష్, రమేష్, పద్మావతి, పి. వెంకటేశ్వర్లు, ఎంవీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి

వినుకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ప్రజాపోరు ప్రచార యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంతోపాటు రూరల్‌లో ఉన్న పలు సమస్యలపై తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. నిత్యావసరాల ధరలు నియంత్రించాలని, జమిలి ఎన్నికలు రద్దు చేసుకోవాలని, మహిళలు, చిన్నారులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, ఇంకా పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం వినుకొండ కమిటీ నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, ఎస్‌కే రంజాన్‌బీ, వెంకటేశ్వర్లు, ఆర్. ముని తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు



పై మధుకిషోర్, కే శివసాకేత్

నరసరావుపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో ఈ నెల 24 నుంచి జరిగే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు పై మధుకిషోర్, కే శివసాకేత్ ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మువ్వల సుబ్రహ్మణ్య సుధీర్ గురువారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7 వరకు స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో అండర్-19 స్విమ్మింగ్ పూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు జరిగాయన్నారు.



రోడ్డుపై ప్యాచ్ వర్క్ చేస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రత్యేక చర్యలు

చిలకలూరిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చిలకలూరిపేట నరసరావుపేట మార్గంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్ కుమార్ లింగంగుంట్ల - గంగన్నపాలెం మధ్య ఇప్పటికే ప్రమాదాలకు సంబంధించిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి కొన్ని ప్రత్యేక చర్యలు చేపట్టారు.

వర్షానికి నేలవాలిన వరిపైరు



కొచ్చెర్లలో వర్షం దెబ్బకు నేలవాలిన వరిపైరు

ఈపూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో సాగుచేసిన ముదురు వరిపైరు నేలవాలింది. ప్రస్తుతం వరి గింజపోసుకుంటున్న సమయంలో పైరు పడిపోవడంతో పూర్తిగా దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటలు వర్షానికి దెబ్బతినడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కనీసం పంటపై పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు వాపోతున్నారు.

ఐదు ఎకరాలు సాగు చేశాను: అంకారావు, రైతు కొచ్చెర్ల

సాగునీరు వస్తుందని తెలియగానే వరిపంట వేశాను. పైరు ప్రస్తుతం గింజ పోసుకునే దశలో ఉంది. మూడు ఎకరాలు నేలవాలింది. మిగతాది పాక్షికంగా దెంది. ఈ వర్షం ఇలాగే కొనసాగితే గింజ కూడా చేతికి వచ్చే పరిస్థితిలేదు.